క్లుప్తంగా

నాణ్యమైన కందిపప్పు సరఫరా



అంగన్వాడీ కేంద్రంలో కందిపప్పును పరిశీలించిన సీఎస్‌డీటీ

బలిజిపేట: అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న కందిపప్పు నాణ్యంగా ఉందని సీఎస్‌డీటీ రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలోని 5వ అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన గురువారం వచ్చి కందిపప్పు ఉడికించిన దానిని పరిశీలించి బాగా ఉడికినట్లు గుర్తించారు. చిన్నారులకు వండిన కందిపప్పును వేయగా పారవేయకుండా తిన్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. పాడి కందిపప్పులో ఎటువంటి చెత్తచెదారం లేదని, కందిపప్పుపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని కొట్టిపారేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద సంక్రాంతి సంబరాలు



అరసాడలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న కార్యకర్తలు

బలిజిపేట: మండలంలోని అరసాడ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల వద్ద రంగురంగుల ముగ్గులు వేసి, చిన్నారులతో వేషాలు వేయించి, పాటలు పాడించి, ఆటలు ఆడించి సంబరాలు జరుపుకున్నారు. అందులో భాగంగా భోగి మంటను వేశారు. చిన్నారులకు సంక్రాంతి సంబరాల ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఘనంగా వివేకానందుని జయంతి



వివేకానందునికి పూలమాలలు వేసిన యువకులు, పెద్దలు

బలిజిపేట: స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా బలిజిపేటలో యువకులు, పెద్దలు గురువారం వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వివేకానందుని ఆశయసాధనకు అందరం పాటుపడాలని పిలుపునిచ్చారు. యువకులు, పెద్దలు వివేకానందుని సూక్తులను గ్రహించి వాటిని ఆచరించాలని కోరారు. యువకులలో నూతనోత్తేజాన్ని నింపిన మహనీయుడని కొనియాడారు. యువకులు ఎంత శ్రమిస్తే వారి భవిష్యత్తుతో పాటు దేశ భవిష్యత్తు కూడా తిరుగులేని విధంగా ఉంటుందని చెప్పేది వివేకానందుడేనని కీర్తించారు. ఆయన నోటివెంట వచ్చే ప్రతి మాట యువతకు బంగారు బాట అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వి.సుబ్బారావు, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు, యువకులు పాల్గొన్నారు.

పదోన్నతులపై హర్షం



ఉపాధ్యాయులకు ఉత్తర్వులు అందజేసిన ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురం టౌన్: ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగ ఉన్నతి కల్పించడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధులకు దుప్పట్ల వితరణ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న హెచ్‌సీ కృష్ణమూర్తి

పార్వతీపురం టౌన్:

స్వామి వివేకానందుని జయంతి సందర్భంగా పార్వతీపురం టౌన్‌పోలీస్ స్టేషన్‌లో వృద్ధ మిత్ర కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి పలువురు వృద్ధులకు దుప్పట్లు, రగ్గులు, స్టీల్ గ్లాసులు అందజేశారు. మండలంలోని చినమరికి గ్రామంలో ఎస్సీ,ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న మహిళలకు గ్రామ పెద్దలు గంటా.అప్పలస్వామి, గంటా లక్ష్మి, నామాల గంగ, అలజంగి రాణి, రావుపల్లి నిర్మల, పోలీస్‌సిబ్బంది సమక్షంలో అందజేశారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

- సీఎం జగనన్నను దీవించాలి
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



అప్పయ్యపేటలో సంక్షేమపథకాల బుక్‌లెట్‌ను అంద జేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసేందుకు కులం, మతం, రాజకీయం చూడం అన్న నినాదంతో గడపగడపకు వెళ్తూ సమస్యలు పరిష్కరిస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సీతానగరం మండలంలోని పెదభోగిలి-2 పరిధి అప్పయ్యపేటలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందజేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు పంపిణీపై ఆరా తీశారు. గ్రామంలో గుర్తించిన ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాలకు కదలి వస్తోందని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలసమయంలో ఇచ్చిన నవరత్నాల పథకాల వాగ్దానాలను 89 శాతం అమలు చేశారని పేర్కొన్నారు.

ప్రతి కుటుంబానికి నవరత్నాల పథకాలు

ప్రతి కుటుంబానికి నవరత్నాల ద్వారా ఇళ్లస్థలాలు, పక్కాగృహాలు, ఇంటింటి కుళాయిలు, జగనన్న తోడు, రైతుభరోసా, విద్యాదీవెన, విద్యాకానుక, రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ, ఆరోగ్యశ్రీ తదితర సంక్షేమ పథకాలతో ఆర్థిక చేయూత ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేసే అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. గ్రామాన్ని అభివృపథంలో నడిపించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అలాగే మైనారిటీ కుటుంబాల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునిస్తూ కార్పొరేషన్ ఏర్పాటు చేసి అర్హులైనవారికి పదవులు ఇచ్చినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మండలనాయకులు బి.చిట్టిరాజు.పెదభోగిలి-1, పెదభోగిలి-2 ఎంపీటీసీలు బి కుసుమ, ఎస్ గౌరి, స్థానిక నాయకులు సబ్బాన ఆనందరావు, జి లక్ష్మునాయుడు, బురిడి సూర్యనారాయణ, ఆర్‌వీ పార్థసారథి, ఎస్ వెంకటరమణ,ఎస్ కిరణ్‌కుమార్, ఎస్ రమేష్, పీఏసీఎస్ చైర్మన్ కుర్మారావు, ఎంపీడీఓ కార్యాలయం ఏఓ ఎం.ఎల్ ఎస్.ప్రసాద్, పెదభోగిలి ఉపసర్పంచ్ అరవింద్‌కుమార్, మండల స్థాయి అధికారులు సోమేశ్వర రావు, ఎం.నాగలక్ష్మి, జి సూరిదేముడు, ఆర్ శ్రీరాములు, కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

వివేకానంద ఆదర్శప్రాయుడు



వివేకానందుడికి నివాళులర్పిస్తున్న రంభ రజనీకాంత్, తదితరులు

సాలూరు: స్వామి వివేకానందుడు ఆదర్శప్రాయుడని రామానుజన్ మ్యాథ్స్ క్లబ్ వ్యవస్థాపకుడు రంభ రజనీకాంత్ అన్నారు. సత్యసాయి కళాశాలలో వివేకానంద జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల ఆవరణలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి వివేకానందుడని కొనియాడారు. ఆయన నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గిరి, సత్యనారాయణ, సంతోష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ ప్రారంభం



మొక్కలు పంపిణీ చేస్తున్న డీఎఫ్‌ఓ ప్రసూన

సాలూరు: పట్టణంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ నర్సరీని డీఎఫ్‌ఓ ప్రసూన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నర్సరీని సద్వినియోగం చేసుకుని ప్రకృతిని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజలకు వివిధ రకాల మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ రామారావు, అధికారులు రామకృష్ణ, గంగరాజు, దేవరాజు, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

శంబరలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవకుమార్

మక్కువ: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి జాతర ఈనెల 23, 24, 25వ తేదీలలో జరుగనున్న నేపథ్యంలో ఎంపీడీఓ పి. దేవకుమార్ పర్యవేక్షణలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని అన్ని వీధుల్లో కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు. అలాగే రహదారులను శుభ్రం చేశారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ



వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న సామాజిక కార్యకర్త శ్రీనివాస కళాధర్

పాచిపెంట/మక్కువ: మండలంలోని కర్రివలస పంచాయతీ అమ్మవలస గ్రామానికి చెందిన ఆదివాసీ యువతకు సామాజిక కార్యకర్త మామిడి శ్రీనివాస కళాధర్ వాలీబాల్ కిట్లను గురువారం పంపిణీ చేశారు. తన తల్లిదండ్రులు పుష్పమ్మ, కొండలరావు జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు శ్రీనివాస కళాధర్ తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు



కలెక్టర్‌ను కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు

పార్వతీపురం: విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను గురువారం కలిసి తమ సమస్యలను విన్నవించారు. టైలర్లు, ఆటో డ్రైవర్లకు ఇస్తున్నట్లే తమకు కూడా ఏటా ఆర్థిక భరోసా కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమకు సహకారాన్ని అందించాలని కోరారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి తమ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బూరాడ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

రూ.62 కోట్లతో తాగునీటి పథకం

- ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు



నాడు-నేడు స్కూల్ భవనం పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ల బృందం

భామిని: మండలంలో రూ.62 కోట్ల వ్యయం కాగల మంచినీటి పథకం మంజూరైందని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఓ.ప్రభాకరరావు గురువారం తెలిపారు. లివిరి, భామిని, సింగిడి ప్రాంతాల్లో డీఈఈ పి.ఢిల్లీశ్వరరావుతో కలిసి బుధవారం పర్యటించారు. నీటి పథకాలు, నాడు – నేడు భవనాల నిర్మాణాలను పరిశీలించారు. జాతీయ జలజీవన్ పథకంలో భాగంగా మండల వ్యాప్తిగా తాగునీరు అందించేందుకు మాస్టర్ ప్లాన్ ప్రకారం మంజూరైందన్నారు. ఈ పథకంలో సింగిడి వద్ద వంశధార నది నుంచి నీటిని ఇన్‌ఫిల్టర్ వెల్స్‌లోకి పంపించి బురుజోల కొండపై ఏర్పాటు చేసే భారీ ట్యాంక్‌కు తరలిస్తామన్నారు. ఈ భారీ పథకంతో భామిని మండలంలోని 87 హేబిటేషన్లలో 54 హేబిటేషన్లకు పైపులైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. వారి వెంట ఏఈఈ అమరాన సందీప్, వీఈఏ ప్రియాంక, ఉపాధి ఎఫ్ఏ వెంకటరమణ ఉన్నారు.

వనరుల ఆవశ్యకతను చిన్నారులకు వివరించాలి

- మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు
- ఘనంగా వివేకానంద జయంతి



చిన్నారి రిషిత్ కు జ్ఞాపికను అందిస్తున్న కమిషనర్



కార్యక్రమానికి హాజరైన అతిథులు, అధికారులు



మాట్లాడుతున్న కమిషనర్ రామప్పలనాయుడు



దేశభక్తి గేయానికి నృత్యం చేస్తున్న కళాకారులు

పార్వతీపురం టౌన్: హిందూతత్వం అంటే మతం కాదని, సమూహ జీవన విధానమని ప్రపంచానికి చాటిన స్వామి వివేకానందను అంతా స్ఫూర్తిగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు కోరారు. పునర్వి ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ శరవణన్ రాజగోపాలన్ ఆధ్వర్యంలో పార్వతీపురం జట్టు ఆశ్రమంలో వివేకానంద జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..ప్రకృతి వనరుల ఆవశ్యకతను చిన్నప్పటి నుంచే చిన్నారులకు వివరించాలని కోరారు. తద్వారా వారు యువశక్తిగా ఎదిగి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కాగలరని ఆకాంక్షించారు. స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యం, అభివృద్ధి, విజ్ఞానానికి సంకేతాలని డిప్యూటీ ఈఓ పి.బ్రహ్మాజీరావు సూచించారు. ఇందులో భాగంగా గాలి, నీరు, భూమి కాలుష్యానికి కారణాలు, ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో నీపాత్ర' అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు, సంప్రదాయ వంటలు, పర్యావరణ హితమైన అంశాలపై ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిభ చాటారు.

విజేతలకు బహుమతుల అందజేత

అలాగే ఒకటవ తరగతి విద్యార్థి రితిక్ రెడ్డి వివేకానంద జీవితాదర్శంపై చేసిన ప్రసంగం, జట్టు కళాకారుల బృందం నృత్య ప్రదర్శనలు, యోగాసనాలు, కర్రసాము, కత్తిసాము తదితర సాహస కృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం గిరిజన ఉద్యోగ సంఘం నాయకుడు నందివాడ కృష్ణబాబు పంపిణీ చేసిన బహుమతులను విజేతలకు అందించడంతో పాటు అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో జట్టు నిర్వాహకురాలు పద్మజమ్మ, పంచాయతీ రాజ్ డీఈ లక్ష్మణరావు, విక్రమపురం ఎంపీటీసీ దేవకోట వెంకటనాయుడు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ, ఉపాధ్యాయులు రేవళ్ల సతీష్ రాజు, గొండేల రాజు, అల్లువాడ కైలాసరావ్, గొంగాడ రామారావు, చుక్కా పారినాయుడు, సీహెచ్.రామకృష్ణ, వనజ, పి.శైలజ, ఎం.ఈశ్వరరావు, మీగడ శ్రీనివాసరావు, కమల, ఎం.విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు

పార్వతీపురం టౌన్: సంక్రాంతి పండగ సెలవుల సందర్భంగా ప్రయాణికుల నుంచి కాంట్రాక్ట్ క్యారేజ్ బస్ ఓనర్స్ రవాణా చార్జీలు అధిక మొత్తంలో వసూలు చేయకూడదని జిల్లా రవాణా అధికారి శశి కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా అదనపు చార్జీలు ప్రయాణికుల నుంచి వసూలు చేసిన ట్లెతై అటువంటి వాహనాలపై రవాణా శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఎవరైనా అదనపు చార్జీలు వసూలు చేస్తే తెలియజేయాలని కోరారు. ప్రజలు ఫిర్యాదు చేయడానికి రవాణా శాఖ, పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి ఈ ఫోన్ నంబర్ 9154294416ను సంప్రదించాలని సూచించారు.

ఆద్యంతం..ఆధ్యాత్మికం

- పల్లెసీమల్లో భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు
- మొదలైన సంక్రాంతి సంబరాలు



బలిజిపేట: వెంగాపురం రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బలిజిపేట: తెల్లవారుజామున నగర సంకీర్తన చేస్తున్న భక్తులు



సీతానగరం: ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి



సీతానగరం: పల్లకిలో ఊరేగుతున్న గోదాదేవి అమ్మవారు



సీతానగరం: బళ్ల కృష్ణాపురంలో గోదాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



పార్వతీపురం టౌన్: ప్రత్యేక అలంకరణలో స్వామివారు, గోదాదేవి

బలిజిపేట: ధనుర్మాసం వచ్చిందంటే పల్లెల్లో సందడి ప్రారంభమవుతుంది. వేకువ జామున లేచింది మొదలు ఆధ్యాత్మిక సంబరాలతో రోజు మొదలవుతుంది. ముఖ్యంగా మహిళల రంగవల్లులతో వీధులు సుందరంగా కనిపిస్తాయి. గొబ్బెమ్మలు..ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతాయి. డూడూ బసవన్నల ఊరేగింపులు, పిండివంటల ఘుమఘుమలు, నూతన వస్త్రాలు ధరించిన పిల్లలు కేరింతలు, బంధుమిత్రులతో గ్రామాలు కళకళ లాడుతాయి. ఇళ్లవద్ద ధాన్యం రాశులతో అన్నదాతల మోములో సంతోషం కనిపిస్తుంది. ధనుర్మాసంతో పండగ నెల ప్రారంభమవుతుంది. పల్లెసీమలు పరవశిస్తాయి. అన్నదాతలు కష్టించి పండిన పంట ఇంటికి చేరుతుంది. సంక్రాంతి సంబరాలు చేసుకుంటారు. హరిదాసు కీర్తనలు వాడవాడలా వినిపిస్తాయి. ఆలయాలు హరినామ స్మరణతో హోరెత్తుతాయి. భక్తులు తెల్లవారుజామున గోవింద నామాలతో పురవీధుల్లో భజనలు చేస్తారు. ఆలయాలలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

గొబ్బెమ్మల కొలువు

పండగ నెల ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి ఇంటి ముందు అందమైన ముగ్గులు వేసి, వాటి మధ్య గొబ్బెమ్మలు పెట్టి సంబరాలు చేసుకుంటారు. గోదాదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తారు. సంక్రాంతి రోజున పితృ దేవతలకు కొత్త బట్టలు చూపించి తర్పణాలు వదులుతారు. పెద్దల ఆశీర్వచనం పొందుతారు.

30పాశురాలతో పూజలు

ఆలయాల్లో స్వామివారికి, గోదాదేవికి 30పాశురాలతో పూజలు చేస్తారు. ధనుర్మాసం శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైనది. ఈ సందర్భంగా స్వామివారి ఆలయంలో తిరుప్పావై నిర్వహిస్తారు. భోగి రోజున గోదాదేవి కల్యాణంతో ధనుర్మాసం పూర్తవుతుంది. గోదాదేవి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహిస్తారు.

వైభవంగా గోదాదేవికి పూజలు

సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామి తులసీ దళాల అలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారిని వేకువ జామునుంచే అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ మేరకు అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ప్రతి గురువారం పలుగ్రామాల నుంచి భక్తులు లక్ష్మీనృసింహ స్వామి వారికి మొక్కులు తీర్చుకునేందుకు రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అలాగే ధనుర్మాసం ఉత్సవాలను పురస్కరించుకుని సీతానగరం వేణుగోపాల స్వామి, బళ్లకృష్ణాపురం వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో గోదాదేవి అమ్మవారికి నిత్య పూజలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బళ్లకృష్ణాపురం ఆలయంలో స్వామివారికి తిరువీధి నిర్వహించిన గోవింద మాలాధారులతో పాటు భక్తులంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సుశీల, మాజీ సర్పంచ్‌లు ఎస్.రామకృష్ణ, డి.సింహాచలం, ఉపసర్పంచ్ బి.భూషణరావు పాల్గొన్నారు. అలాగే వేణుగోపాల స్వామికి పూజలనంతరం గోదాదేవి అమ్మవారిని గోవింద మాలాధారులంతా పల్లకి అధిష్టింప చేసి తిరువీధి నిర్వహిస్తూ గోవింద నామాలు చదివి వినిపించారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు నిర్వాహకులు సమకూర్చిన నిధులతో ప్రసాదాల వితరణ చేశారు.

భక్తి శ్రద్ధలతో ధనుర్మాస పూజులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని గురువారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు జగన్నాథాచార్యులు తెల్లవారుజామున 4గంటల నుంచే ప్రత్యేక పూజలను నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా గత నెలరోజులుగా పాశురాల పారాయణం భక్తులకు వివరించారు. పూజల అనంతరం భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.